

తాగునీటి సమస్య తీరేనా..

● 'అడవిపల్లి రిజర్వాయర్' పనులు పూర్తి చేయండి ● 9న మన చిత్తూరు అభివృద్ధి వేదిక సదస్సు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
చిత్తూరు అనగానే మొదట గుర్తుకొచ్చేది తాగునీటి సమస్య. సుదీర్ఘకాలంగా చిత్తూరు నగరాన్ని తాగునీటి సమస్య వెంటాడుతోంది. పాలకులు, అధికారులు మారుతున్నా సమస్యకు మాత్రం పరిష్కారం దొరకడం లేదు. చిత్తూరు నగరాభివృద్ధిని కాంక్షిస్తూ సమస్యలపై ఎప్పటికప్పుడు గళం విప్పుతున్న మన చిత్తూరు అభివృద్ధి వేదిక ఈనెల 9వ తేదీ శనివారం స్థానిక ఎన్‌జివో హోంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని, అడవిపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరుతూ సదస్సును నిర్వహించనుంది. ఈ సదస్సుకు విఆర్ కేశవులు రెడ్డి రిటైర్డ్ లెక్చరర్ పివికెఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు. చిత్తూరు నగరంలో ఉన్న తాగునీటి సమస్యపై ప్రధానంగా సదస్సులో చర్చ జరుగనుంది. ఈ సదస్సులో మేధావులు, నగర ప్రజలు పెద్దసంఖ్యలోపాల్గొని విజయవంతం చేయాలని మన చిత్తూరు అభివృద్ధి వేదిక సభ్యులు కోరుతున్నారు.

తాగేందుకు స్వచ్ఛమైన మంచినీరు దొరక్క నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రైవేట్ వ్యక్తుల నుంచి తాగునీటిని కొనుక్కోవల్సిన దుస్థితి ఏర్పడింది. సొంత వాటర్ ప్లాంట్లు ఉన్న ప్రైవేటు వ్యక్తులు ఇదే అదునుగా నీటిని అమ్ముకుంటూ లాభాలు దండుకుంటున్నారు.

మనిసికి తాగునీరు చాలా అవసరం, రోజుకు కనీసం 3 నుంచి 5 లీటర్ల నీరు తాగాలని ఆరోగ్యనిపుణులు చెబుతూనే ఉంటారు. పట్టణాల్లో, నగరాల్లోని తమ ఇంటి అవసరాలకు రోజుకు సరాసరిగా 150 నుంచి 200 లీటర్ల నీరు అవసరమవుతుందని కేంద్ర ప్రభుత్వం ఓ నివేదిక ద్వారా తెలిపింది. శరీరంలోని అన్ని ముఖ్యవ్యవస్థలు పనిచేయడానికి, మానవ జీవనానికి ఆక్సిజన్‌తో పాటు నీరు అత్యవసరం. సగటు మనిషి ఆహారం తీసుకోకుండా రోజుల తరబడి జీవించగలడు కానీ నీరు తాగకుండా కొన్ని రోజులు మాత్రమే జీవించగలడు. అటువంటి నీటిని అందించడానికి చేపట్టిన అడవిపల్లి రిజర్వాయర్ చిత్తూరు నగర ప్రజలకు అందని ద్రాక్షలా మిగిలింది.

నిధులేక నీరశించిన అమృత్ పథకం

పట్టణాల సుందరీకరణ, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా కేంద్రప్రభుత్వం తెచ్చిన అమత్ (అటల్ మిషన్‌పర్ రిజువినేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ఫరమేషన్) పథకాన్ని మన చిత్తూరు నగరానికి కూడా మంజూరు చేస్తూ 2016 మార్చిలో నిధులను మంజూరు చేసింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాగునీరు, సాగునీటి కోసం కెవి.పల్లి మండలంలోని అడివిపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మించి అక్కడి నుండి చిత్తూరు నగరానికి తాగునీరు సరఫరా చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, వెంటనే టెండర్లు పిలిచి ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

బుట్టదాఖలైన హామీలు...

'అమృత్' నిధుల నుంచి అడవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి రూ.276కోట్లు మళ్లిస్తామని చిత్తూరు ఎమ్మెఏల్య ఆరణి శ్రీనివాసులు 2023 మార్చి 31న మీడియా సాక్షిగా చెప్పారు. అయితే ప్రాజెక్టు పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. చిత్తూరు నగర జనాభా దాదాపు 2.5లక్షలకు పైగా ఉంటుంది. రోజురోజుకు జనాభా కూడా పెరుగుతోంది అయినప్పటికీ తాగునీటి సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం చూపడం లేదు పాలకులు.

పేరుకే జిల్లా కేంద్రం

జిల్లా కేంద్రమైన చిత్తూరు నగర అభివద్ధి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందంగా ఉంది. దీనికి తోడు అధికారులు, పాలకుల నిర్లక్ష్యం. జిల్లా విభజన తర్వాత చిత్తూరు నగరం వెనుకబడిపోయింది. ఉమ్మడి జిల్లాలోనూ చిత్తూరు నగరం సమగ్రాభివృద్ధికి నోచుకోలేదు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరగడం లేదు. ఎన్‌టిఆర్ జలాశయం వర్షాలు బాగా పడినప్పుడు వర్షపు నీటితో నిండుగా ఉంటుంది. వానలు లేకపోతే ఇక అంతే. గతేడాది కురిసిన వర్షాలకు జలాశయం నిండి నగర వాసులకు నీరు అందుతున్నా అవి ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. వేసవిలో అయిన జలాశయం లోతును పెంచి నీటి సామర్థ్యాన్ని పెంచే దిశగా అధికారులు ఆలోచించాలని ప్రజలకు కోరుతున్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న మన చిత్తూరు అభివృద్ధి వేదిక ప్రతినిధులు

పైపు లైన్లు లీకేజీలు మరో సమస్య..

నగరంలోని నివాసాలకు మున్సిపల్ కార్పొరేషన్ పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్న నీరు పలుచోట్ల మధ్యలోనే లీకేజల కారణంగా వృథా అవుతున్నాయి. దీని వలన రోజూ వందల లీటర్ల నీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. ఈ పైపులైన్లు తుప్పు పట్టి పగిలిపోవడం వల్లే లీకేజీలు అవుతున్నాయి. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీనిపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలి, లికేజీలను అపి నీరు వృథా కాకుండా చూడాలి.

కేంద్రప్రభుత్వం 2021 అక్టోబర్ 1న అమత్ 2.0 పతాకాన్ని ప్రారంభించి నిధులను ప్రకటించిన అమత్ నగరాలకు నిధులు విడుదల చేసింది. ఆ నిధులతో మునిసిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు నీటిసరఫరా వ్యవస్థను మెరుగు పరచాలని సూచించింది. చిత్తూరు నగర ప్రజల తాగునీటి కోసం అడివిపల్లి రిజర్వాయర్ పనులను రాజకీయాలకు అతీతంగా యుద్ధప్రాతి పదికన పూర్తి చేయాలని మన చిత్తూరు అభివద్ధి వేదిక సభ్యులు, చిత్తూరు నగర వాసులు కోరుతున్నారు.

హోంగార్డ్ సేవలు ప్రశంసనీయం

వారి సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
61వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంను చిత్తూరు జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి వై.రిశాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మన దేశంలో హోంగార్డ్ వ్యవస్థ 1946 సంవత్సరంలోనే ప్రారంభం అయ్యిందని, ఆ తర్వాత 1963వ సంవత్సరంలో డిసెంబర్ 6వ తేదీన ఈ వ్యవస్థ బాధ్యతాయుతమైన పౌరులు సమాజానికి స్వచ్ఛంధ సేవ చేయడం కోసం పురుడు పోసుకుందని తెలిపారు. పోలీసులతో పాటు ఏమాత్రం తీసిపోని విధంగా హోంగార్డులు సేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు. పోలీసుశాఖ క్రమశిక్షణకు మారుపేరని, నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు ప్రతిష్టను పెంచేలా విధులు కొనసాగాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే క్రమంలో అంకితభావంతో పని చేయాలన్నారు. చిత్తూరు జిల్లాలో శాంతి భద్రతల కోసం 437మంది హోంగార్డ్స్ విధులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరితో పాటు 139 హోంగార్డ్స్ వివిధ విభాగాలలో డెప్యుటేషన్ మీద పని చేస్తున్నారని తెలుపుతూ హోంగార్డ్స్ పోలీసు వారితో సమానంగా ట్రాఫిక్ రెగ్యులేషన్, శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాలను ఆరికట్టడంలో పోలీసులకు వెన్నుదన్నుగా ఉంటున్నారని, వారి సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా చిత్తూరు జిల్లాలో హోంగార్డ్స్ బెనిఫిట్ ఫండ్‌ను ఏర్పరచి ఆ ఫండ్ సహాయంతో ఎవరైనా హోంగార్డ్స్ గాయపడిన రూ.30వేలు, మరణించినా తక్షణ సహాయంగా రూ.4లక్షలు, రిటైర్ అయ్యే సందర్భంలో రూ.4లక్షలతో కానుకలు ఇచ్చి ఘనంగా సన్మానించి పంపడం జరుగుతోందని తెలిపారు. చిత్తూరు జిల్లాలో చనిపోయిన 2 హోంగార్డ్స్ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున అందించడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమాన్ని నిర్వహించిన అధికారులను ఎస్పీ అభినందిస్తూ జ్ఞాపికలతో అభినందించారు.



హోంగార్డ్స్‌ను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమపథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' చిత్తూరు జిల్లా ప్రత్యేక అధికారి, పరిశీలకులు సచింద్ర కుమార్ పట్నాయక్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమ నిర్వహణకు సంబంధించి సంబంధిత శాఖల జిల్లాస్థాయి అధికారులతో ప్రత్యేక అధికారి, పరిశీలకులు, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, నోడల్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. పరిశీలకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు పేదలకు అందేలా అర్హులైన వారికి చేరేలా అధికారులు కషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంను నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 697 పంచాయతీలలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పై అవగాహన కల్పించడానికి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని పగడ్బందీగా విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకుని, అమలు చేయడం జరుగుతున్నదని తెలిపారు. ఇప్పటివరకు 100 పంచాయతీలలో ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమం నవంబర్ 27 నుండి ప్రారంభమయ్యిందని, ఈ కార్యక్రమ నిర్వహణకు జిల్లాస్థాయిలో నోడల్ అధికారిగా జెడ్పి సిఈఓ వ్యవహరిస్తున్నారని, జిల్లాకు 6 ప్రచారయాత్ర వాహనాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఒక్కో వాహనం ప్రతి రోజు రెండు పంచాయతీల్లో డిజిటల్ స్క్రీన్‌లో వీడియోల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం ఎంపిడిఓలు మండలాలలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతున్నదని తెలిపారు. ఈసమావేశంలో డిఆర్‌డిఏ హౌసింగ్, మెప్మా పిడిలు తులసి, పద్మనాభం, రాధమ్మ, సోషల్ వెల్ఫేర్ డిడి రాజ్యలక్ష్మి, డిపిఓ లక్ష్మి, పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, డిఎస్ఓ శంకరన్, డిఎల్‌డిఓ రవి కుమార్, ఎల్‌డిఎం హరీష్, జిఎం డిఐసి చంద్రశేఖర్, నెహ్రూ యువకేంద్ర కొఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, జిల్లా మైనారిటీ శాఖ అధికారి చిన్నారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీ కష్ణ, ఐసిడిఎస్ పిడి నాగ శైలజా, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బానీ బాష, డిపిఆర్‌సి కోఆర్డినేటర్ షణ్ముగం, అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెసి శ్రీనివాసులు

జనవరి 5న ఓటర్ల జాబితా విడుదల: జేసి

మార్పులు, చేర్పులకు సంబంధించి 9 లోపు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తీసివేతలకు సంబంధించి ఈనెల 9 లోపల దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి నిర్వహించారు. ఈసందర్భంగా జేసి మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తీసివేతలకు సంబంధించి ఈ నెల 9లోపు దరఖాస్తు చేసుకోవాలని, అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి 2024 జనవరి 5న ఓటర్ల జాబితా విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు తమ పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. బిఎల్‌ఓలు గత రెండు రోజులు పాటు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో దరఖాస్తులు తీసుకోవడం జరిగిందని, క్షేత్రస్థాయిలో పరిశీలన కాలపరిమితి లోపల జరుగుతుందని అన్నారు. పూర్తి సమాచారం లేకపోతే పరిశీలన కష్టం అవుతుందని అటువంటి క్లైములు అపరిష్కృతంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈసమావేశంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి పరదేశి, సిపిఎం ప్రతినిధి గంగరాజు, బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, వైఎస్‌ఆర్సిపి ప్రతినిధి ఉదయకుమార్, టిడిపి ప్రతినిధి ప్రభుతేజ లు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జెసి శ్రీనివాసులు

డాక్టర్ అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక జిల్లా సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి, దర్గా సర్కిల్ వద్ద గల విగ్రహానికి జాయింట్ కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, జెడ్‌పి సిఈఓ ప్రభాకర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి రాజ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న జెసి

వృద్ధులకు పండ్లు పంపిణీ

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం చిత్తూరులోని తపోవనం సమీపంలో రాష్ట్రీయ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వద్ధాశ్రమంను జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు సందర్శించారు. వృద్ధాశ్రమం దాదాపుగా 30 సంవత్సరాల నుండి సేవాలనందిస్తున్నదని, ఈ వద్ధాశ్రమంలో వద్ధులతో పాటు మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు సైతం ఉన్నారని, ప్రతి వారం వీరికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. వృద్ధులకు, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం, అవసరమైన మందులు, బట్టలు, ఆహారం అందించి దాతలు చేయూతనివ్వాలని కోరారు.

రాజ్యాంగ నిర్మాతకు జేజేఎం ట్రస్ట్ ఘన నివాళి

నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద జిజెఎం ఫౌండేషన్ ఛైర్మన్ గురజాల జగన్ మోహన్ తండ్రి గురజాల చెన్నకేశవ నాయుడు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. టిడిపి నాయకులు సప్తగిరి ప్రసాద్, హేమాద్రి నాయుడు, మోహన్ రాజ్, శశికర్ బాబు, మేషాక్, రాజా పాల్గొన్నారు.



గుడిపల్లిలో..

గుడిపల్లి: మండలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని కుప్పం నియోజకవర్గం దళిత నాయకుడు సుబ్రమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గారిక చంద్రశేఖర్, దళిత నాయకులు రాము, విజయ్ కుమార్, నారాయణ, మునుస్వామి, రాజేష్, టిడిపి నాయకులు హేమాంబర్ గౌడ్, గోపాల్, గజేంద్ర పాల్గొన్నారు.

చౌడేపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకొని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ భవన వ్యవస్థాపక అధ్యక్షుడు బ్యాంకు రెడ్డప్ప ఎస్సి బాలబాలికల వసతి గహాల్లో వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కూనపర్తి శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ముకుంద పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల కేంద్రంలో చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందుకూరి హుమేష్, సుబ్రహ్మణ్యంరెడ్డి, దావుద్, పల్లిపట్టు భాస్కర్ వెంకటేష్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



జేజేఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో..

బంగారుపాళ్యం: పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్.బాబు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అణగారిన గొంతులకు ఆత్మగౌరవపు పెన్నిధి మానవత్వం పంచే ఆధునిక బుద్ధుడు అంబేద్కర్ అని కొనియాడారు. జిల్లా వ్యవసాయసలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు దత్తురెడ్డి, ఏఎంసి ఉపాధ్యక్షులు సర్దార్, మాజీసర్పంచ్ కష్ణమూర్తి, కిషోర్ కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం జగదీష్ పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం మండల అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు, సర్పంచ్ కోక ప్రకాష్‌నాయుడు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సోమలలో..

సోమల: రాజ్యాంగ నిర్మాత, దళిత జాతి ఆశాజ్యోతి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహానేత బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మాటూరి మురళి, మంద రామనాథం, మొగిలిశ్వరయ్య, శుభకర్, ప్రకాష్, జెడ్పిటిసి అమాస కుసుమమోహన్, వైస్ ఎంపీపీ ప్రభాకర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో ఆయన చిత్రపటానికి జడ్జి విష్ణువర్మ పూజలు చేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ సభ్యులు ఏపీపీ రామశాంతి, ఉపకార్యదర్శి రాము, కోశాధికారి నాగరాజు, న్యాయవాదులు ఎం బాబు, ఈజీ బాబు, లోకేష్, మురళీకష్ణ పాల్గొన్నారు. దళితసంఘాల ఆధ్వర్యంలో నగరి అంబేద్కర్ సర్కిల్, మండపం, కాకవేడు తదితర ప్రాంతాలలో భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు.

ఎస్ఆర్.పురం: జిల్లా ఇంచార్జ్ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రవిరాజు, మండల తహశీల్దార్ బెన్నురాజు, ఎంపీడీవో కష్ణయ్య డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. జిల్లా ఎస్సీసెల్ దళిత నాయకుడు కుప్పయ్య, స.హ.చట్టం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కుప్పయ్య, సర్పంచులు చిట్టి మహేష్, సర్పంచ్ మల్లికా అమతరాజు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌పురంలో..

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

అంబేద్కర్ విగ్రహానికి వినతి

ప్రజా ఉద్యమాలను కాపాడుకుందాం వక్తలు పిలుపు

చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో ఈనెల 8 నుంచి సమ్మె చేస్తున్నారని వారి సమస్యలు పరిష్కారం చేసే విధంగా ఆలోచనలు కల్పించే కల్పించాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 63వ వర్ధంతి సందర్భంగా చిత్తూరులో అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించి వినతపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేంద్రన్, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు దాసరి చంద్ర, రమాదేవి, సిఐటియు అనుబంధ సంఘం అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకీలా, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజిని, ఏఐటీయూసీ అనుబంధ సంఘం అంగన్వాడీ జిల్లా కార్యదర్శి ప్రేమ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను ఎలా భగ్నం చేయాలని అధికారులతో ఒత్తిడి చేస్తున్నదే తప్ప, సమస్యలు ఎలా పరిష్కరించాలనే దిశగా ఆలోచన చేయకపోవడం దుర్మార్గమన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కులను రాష్ట్ర ప్రభుత్వం అణచివేసే ప్రయత్నం చేయడం సరింది కాదన్నారు. గతంలో అనేక ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలను అణిచి వేలాయలని చూసిన సందర్భంలో ఆ ప్రభుత్వాలను ఇంటికి పంపించిన చరిత్ర అంగన్వాడీలకు ఉందని దానిని మర్చిపోవద్దని హెచ్చరించారు. ప్రభుత్వం అధికారులు ఎన్ని నిర్బంధాలు విధించినా ఈనెల 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మె జరిగి తీరుతుందని, దాని ఆపడం ఎవరితరం కాదని హెచ్చరించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కూడా రాష్ట్రవ్యాప్తంగా జరిగే సమ్మెకు సహకరించాలని, బెదిరింపులు మానుకోవాలని కోరారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు

పెద్దపంజాణి: మాలమహానాడు మండల అధ్యక్షులు మంజునాథ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎంపీపీ రెడ్డప్ప, వైసిపి మండల కన్వీనర్ బాగా రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి తిప్పయ్య, రాయలసీమ జోన్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



గంగాధర నెల్లూరులో.

గంగాధర నెల్లూరు: భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, వైసీపీ యువజన నాయకులు ఢిల్లీ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం : గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధిని పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు అన్నారు. మండలంలోని మొగలివారిపల్లి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్మోహన్ రెడ్డి ఎందుకు కావాలి కార్యక్రమం సర్పంచులు శ్రీనివాసులు, వల్లెమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, వారి అభివద్ధిని కోరుకున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. గ్రామాల అభివద్ధితోనే రాష్ట్ర అభివద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకు లబ్ధి చేకూరిన సమాచారాన్ని తెలియజేశారు. జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జడ్పిటిసి సోమశేఖర్, ఏఎంసీ ఛైర్మన్ నారే సోమశేఖర్, మాజీ సర్పంచ్ దొరస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈఓ

ప్రజాశక్తి- సోమల: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తేవాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు కోరారు. బుధవారం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లె జడ్పి ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులు రాస్తున్న పరీక్ష విధానాన్ని స్వయంగా చూసి విద్యార్థులకు పలు సూచనలను అందజేశారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు జిల్లాకు మంచి పేరు తేవాలని ప్రతి ఒక్క విద్యార్థి చదువు పట్ల శ్రద్ధ వహించి తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లు అమ్మితే చర్యలు : ఎంపీడీవో

ప్రజాశక్తి- సోమల: ఇరికిపెంట సచివాలయంలో జగనన్న లేఅవుట్లలో గహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు, వాలంటీర్లతో ఎంపీడీవో నాగరాజు బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బేస్మెంట్ లెవల్, రూఫ్ లెవెల్‌లో 665 గహాలు ఉన్నాయని వీటిని త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి గహప్రవేశాలు నిర్వహించేందుకు తీసుకోవలసిన చర్యలపై వాలంటీర్లకు లబ్ధిదారులకు వివరించారు. పలువురు లబ్ధిదారులు తమ ఇంటి స్థలాన్ని గహాలను ఇతరులకు అమ్మి వేసేందుకు ప్రయత్నిస్తున్నారని అలాంటివి ఏవైనా జరిగినట్లు తమ దష్టికి వస్తే ఖచ్చితంగా అమ్మిన వారి పైన కొన్న వారి పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప, హౌసింగ్ ఈఈ, ఏఈ జవిద్ అలి, పంచాయతీ కార్యదర్శి మేనక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ రవికుమార్‌కు ఘన సన్మానం



ప్రజాశక్తి- చౌడేపల్లి: మండల ఎస్ఐగా ఉంటూ బదిలీపై వెళుతున్న రవికుమార్‌ను బుధవారం స్థానిక మండల పరిపాలన భవనంలో స్థానికులు, స్టేషన్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండలంలో శాంతిభద్రతల విషయంలో ఆయన చేసిన కషి మరువలేనిదని కొనియాడారు. కరోనా కష్టకాలంలోనూ ఎస్సై అనేక సేవాకార్యక్రమాలు చేశారని గుర్తుచేశారు. బదిలీపై ఎస్ఐ మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్‌లోను మంచి పేరు తెచ్చుకొని మరిన్ని పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు. రాష్ట్ర దశ్యకళల అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు మిద్దింటి కిషోర్, ఎంపీపీ గాజుల రామ్మూర్తి, ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డిప్రకాష్, సర్పంచ్ శ్రీరామ్ భరత్ వరుణ్, ఎంపీడీవో సుధాకర్, మండల సచివాలయాల కన్వీనర్ రుక్మిణమ్మ, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు కష్ణారెడ్డి, వైసిపి మైనార్టీ అధ్యక్షులు అల్తాఫ్, ఎంపిటీసీ తొండ శ్రీరాములు పాల్గొన్నారు.

చెరువులను నీటితో నింపండి..

జలహారతి పట్టిన ఎంపీపీ లతబాలాజీ

ప్రజాశక్తి- కార్వేటినగరం: జలాశయంలోని ప్రతినీటి బొట్టును ఆయకట్టులోని చెరువులకు చేరే విధంగా చూడాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. వరద నీటితో కళకళలాడుతున్న కష్ణాపురం జలాశయాన్ని సందర్శించి, జలహారతి పట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ లత బాలాజీ మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టు చెరువులకు చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో కష్ణాపురం జలాశయాన్ని అన్ని విధాల అభివద్ధి చేయడానికి కషి చేస్తామని పేర్కొన్నారు. జలాశయం గేట్లు ద్వారా నీటిని విడుదల చేయక ముందే కుశస్థలీ నదీ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలను సైరన్ మోగించి అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జలాశయం పరిసర ప్రాంతాలను పరిశీలించి అనుమతులు లేకుండా సందర్శకులు రాకుండా చూడాలని, నిత్యం సిబ్బంది అందుబాటులో ఉంటూ పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం జలాశయానికి ప్రత్యేకపూజలు నిర్వహించి జలహారతి పట్టారు. వైస్ ఎంపీపీ కార్తీక్. మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, సర్పంచ్ ధనశేకర్ వర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురందర్, ఎంపీడీవో మోహన్ మురళి పాల్గొన్నారు.



ప్రజాశక్తి వార్తకు స్పందన

అంతర్రాష్ట్ర రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి- యాదమరి: పనులు ప్రశ్నార్ధకం.... నాణ్యత నామమాత్రం... అనే కథనం ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం ప్రచురితమైంది. స్పందించిన రోడ్లభవనాల శాఖ అధికారులు చిత్తూరు- గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో గుంతలను జెసిబి ఎక్స్‌కవేటర్‌తో భారీ గుంతలను పూడ్చి చదును చేశారు. జోడి చింతల నుండి తమిళనాడు సరిహద్దు కనికాపురం వరకు రోడ్డు పొడవున ఉన్న గుంతలను పూడ్చారు. గుంతలకు గ్రావెల్ మిక్సర్‌తో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులు కొంత ఉపశమనం కలిగింది. చిత్తూరు- గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి జోడిచింతల నుండి కనికాపురం చెక్పోస్ట్ వరకు పూర్తిస్థాయిలో తారువేసి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



చిత్తూరు- గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారికి మరమ్మతులు చేపడుతున్న జెసిబి, ఎక్స్ కవేటర్

ముమ్మరంగా సహాయక చర్యలు



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి- నగరి : వరద బాధితులకు సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మంత్రి ఆర్కేరోజా తన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా నింద్ర మండలం అత్తూరు, అగరంపేటలోని బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తూ సహాయక చర్యలు చేపట్టారు. ఆమె ఆదేశాల మేరకు అధికారులు చిద్రమైన రోడ్లు, నీటిదారి మళ్లింపు చర్యలు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, విద్యుత్ తీగలు సరిచేయడం వంటి సహాయక చర్యలు ప్రారంభించారు. మరోవైపు పంటలు నీట మునిగిన ప్రాంతాల్లో ఏరువాక కేంద్రం సమన్వయ కార్యకర్త రెడ్డిరాము పర్యటించి పొలాల్లో ఉన్న పంటలను కాపాడుకోవడం, నష్టనివారణ చర్యలు చేపట్టడంపై రైతులకు అవగాహన కల్పించారు. నీటిలో మునిగిన వరిపొలాల్లో నీటిని కాలువల ద్వారా వెళ్లేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ నాగపద్మిని, శాస్త్రవేత్త మోహన్‌రెడ్డి, విశ్వనాథ్, ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, వ్యవసాయఅధికారి రాఘవేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో పర్యటించిన గాలి భాను ప్రకాష

నగరి: తుపాన్ ప్రభావంతో ముంపుకు గురైన నగరి మున్సిపాలిటీ ఇందిరమ్మ కాలనీలో పర్యటించి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అలాగే ఆయన నగరి మున్సిపాలిటీ 1వ వార్డు నగరిపేటలో లోతట్టు ప్రాంతం ఇళ్ళను పరిశీలించి బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణ భేష్

ఎంపీపీ గాజుల రామ్మూర్తి

ప్రజాశక్తి- చౌడేపల్లి



మండల కేంద్రమైన చౌడేపల్లి ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ -17 కబడ్డీ పోటీలు నిర్వహణ భేష్ అని ఎంపీపీ గాజుల రామ్మూర్తి అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ పోటీల నిర్వహణ జమ, ఖర్చులపై విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజంపేట చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గాల వైసిపి యువజన అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ జమ ఖర్చులకు సంబంధించిన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ కబడ్డీ నిర్వహణకు పోటీలు పడ్డారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి జిల్లా సహకారంతో చౌడేపల్లిలో క్రీడలు నిర్వహించడం గర్వకారణం అన్నారు. ఈ క్రీడలు వ్యయంతో కూడుకున్నది కనుక దాతల సహాయం తీసుకున్నామన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన బాలబాలికలకు భోజన, మౌలిక వసతుల కల్పనలో రాజీపడలేదని ఈ విషయాన్ని క్రీడాకారులే ఒప్పుకున్నారన్నారు. అంతేకాకుండా ఇంతవరకు రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా క్రీడాపోటీలు డిజిటల్ చేసి లైవ్ ప్రోగ్రాంను ఇవ్వడం జరిగిందన్నారు. కొందరు వ్యక్తులు నిర్వహణ వ్యయంపై దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారికి తాము విడుదల చేసిన శ్వేతపత్రం సమాధానం చెబుతుందన్నారు. క్రీడల నిర్వహణకు రూ.8,59,318లు దాతల నుండి సహకారం రాగా వ్యయం రూ.9,68,260లు అయ్యిందని, ఇందుకు సంబంధించిన బిల్లులు వారు చూపించారు. అనంతరం క్రీడానిర్వహణపై చర్చించారు. సర్పంచ్ శ్రీరాం భరత్, ప్రధానోపాధ్యాయుడు నాగరాజ రెడ్డి, ప్రైవేట్ పిఈటిల జిల్లా కార్యదర్శి లీలాకుమార్, పిడి రామచంద్రయ్య, కడియాల మహేష్‌బాబు, ఉపాధ్యాయులు మురళి, దేవదానం, గాజుల మోహన్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్సీ కంచర్ల



ప్రజాశక్తి - రామకుప్పం : టీడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుతోనే ఆంధ్ర రాష్ట్రం సర్వతో ముఖాభివద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం భగలనతంలో 'గతం గుర్తు చేసుకుందాం.. బాబు రుణం తీర్చుకుందాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామప్రధాన కూడలిలో పార్టీ పతాకావిష్కరణ చేశారు. కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ... రాష్ట్రం యావత్తు టీడీపీ వైపు చూస్తోందన్నారు. వైసీపీ అరాచక, అవినీతి పాలనలో అన్నివర్గాల ప్రజలు అసంతప్తిగా ఉన్నారు. టీడీపీ తిరిగి అధికారంలోకి రావాలని ప్రతిఒక్కరూ కోరుకుంటున్నారని అన్నారు. బాబు ప్రకటించిన సూపర్ సిక్స్ కార్యక్రమాలతో ప్రజల్లో భరోసా వచ్చిందన్నారు. కుప్పంలో చంద్రబాబు ఘనవిజయం సునాయసమని, లక్ష మెజారిటీ లక్ష్యంగా ప్రతి కార్యకర్త కషి చేయాలన్నారు. వైసీపీ అభ్యర్థికి ఓటు వేస్తే అది వధా అన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఆయన గ్రామాల్లో ఇంటింటా తిరిగి ప్రజలకు తేదీపై గ్యారెంటీ పత్రాలు అందజేశారు. పంచాయతీ పరిధిలోని పలువురు వైసీపీకి చెందిన యువకులు ఈసందర్భంగా టీడీపీలో చేరారు. మునిరత్నం, మునస్వామి, ఆనందరెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, రామమూర్తి, చలపతి, అనసూయ, మునిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి : ఎస్ఐ

ప్రజాశక్తి- శాంతిపురం: రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషన్‌కు అనుసంధానంగా ఉన్న శాంతిపురం మండల కేంద్రంలోని అవుట్ పోస్టును పునఃప్రారంభిస్తామని ఎస్సై వి.సుమన్ తెలిపారు. రాళ్లబూదుగూరు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సుమన్‌కు మీడియా బందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ మండలంలోని సమస్యలపై పాత్రికేయులను అడిగి తెలుసుకున్నారు. భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా పోలీసు సిబ్బందితో కలసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ మండలంలో పోలీస్‌శాఖ నియమ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఫ్రెండ్లీ పోలీస్ తరహాలో తొలుత ప్రజలను చైతన్యపరచడం



జరుగుతుందన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం ట్రిబుల్ రైడింగ్, రికార్డు లేని, లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్న మైనర్ యువకులపై దష్టి సారించనున్నామని తెలిపారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలక పాల్పడుతున్న వారిపై కూడా తీవ్రమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. సైబర్ క్రైం దొంగతనాలు లాంటి వాటిపై పలు పాఠశాలలు, కళాశాలలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మండల పరిధిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో రాళ్ళబుదుగురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ మొగసాల రెడ్డప్ప

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలకు సంబంధించి యువతీ యువకులు వారి పేరు నమోదు కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎంపిపి మొగసాల రెడ్డప్ప తెలిపారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్‌తో ఎంపీపీ సమావేశమయ్యారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీలో జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సబంధించి క్రీడాకారులు రిజిస్ట్రేషన్లు ఎక్కువ సంఖ్యలో చేర్పించి అందరూ క్రీడల్లో పాల్గొనేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీలోని యువ క్రీడాకారులందరూ పోటీల్లో పాల్గొనేలా చూడాలని, వారి పేర్లు రిజిస్టర్ చేసుకునే అవగాహన కల్పించాలని తెలిపారు. ఎంపిడిఓ రాజేంద్ర, జెడ్‌పిటిసి ఏఈ ఆర్డబ్ల్యూఎస్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి పైపులకు మరమ్మతులు చేయాలి

ఎంఈవో2

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

నీటి పైపులకు వెంటనే మరమ్మతులు చేయించలనిఎంఈఓ 2 రమేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు-నేడులో మొదటి, రెండవ ఫేస్‌లో ఎంపికైన పాఠశాలకు మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయని, వాటిని నీటి కొళాయిలు, విద్యుత్తు బల్బుల మరమ్మతులు చేసుకునేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈపనులకు స్కూల్ కమిటీ ద్వారా ఆమోద ముద్ర వేసి బిల్లులకు తగిన రసీదు ఉంచి ఆడిట్ చేసుకోవాలన్నారు. సిఆర్‌సిలు సుశీల, ప్రేమలత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నాడు- నేడు ఫేస్ వన్ పాఠశాలల్లో

మౌలిక వసతులకు నిధులు మంజూరు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని నాడు- నేడు ఫేస్ 1 కింద ఎంపికైన 17 పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎంఈఓ శివరత్నమ్మ తెలిపారు. బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో నాడు- నేడు ద్వారా ఫేస్ 1 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు చిన్నచిన్న మరమ్మతులు ఇతర సౌకర్యాల ఏర్పాటు కోసం నిధులు ప్రభుత్వం నుండి విడుదల అయ్యాయని, ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు విడుదల చేయడం జరిగిందని వీటిని సద్వినియోగం చేసుకొని పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ



ప్రజాశక్తి- గంగవరం: గంగవరం పంచాయతీ ప్రాథమిక పాఠశాలకు పలమనేరు పట్టణానికి చెందిన శ్రీపురం సీతారామయ్య బుధవారం 6 కుర్చీలు వితరణగా అందజేసినట్లు ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గతంలో కూడా సీతారామయ్య ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులకు విద్యాసామగ్రి, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో నియోజకవర్గ అధ్యక్షులు అనంతబాబు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయం రూ. 1.48 లక్షలు



ప్రజాశక్తి- కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం గ్రామ దేవతగా విరాజిల్లుతున్న శ్రీబంగారమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ. లక్ష 48 వేల 5వందలు వచ్చినట్లు ఆలయ అధ్యక్షుడు కే.ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల సమీక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి, ఈనెల 19, 20 తేదీలలో జరిగే అమ్మవారి జాతరకు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఉపాధ్యక్షుడు రంగనాధమొదలి, కార్యదర్శి చంద్రశేర్ పిళ్లై, ఆర్.రాజశేఖర్, తులసి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:



మండలంలోని ఎం.కొత్తూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కార్వేటి రామనగర్ గ్రామంలో తాగునీటి బోరులో ఉన్న సింగల్ ఫేస్‌మోటర్ మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం అవస్థలు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ చంద్రమౌళి స్పందించి బోరు మరమ్మతులు చేపట్టారు. బోర్‌లో త్రీఫేస్ కొత్త మోటర్ బిగించి తాగునీటి సమస్య పరిష్కరించి గ్రామస్తులకు తాగునీటిని అందించారు.

ఆధునిక విమర్శకు మార్గదర్శకుడు కట్టమంచి



ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ ఆధ్వర్యంలో బుధవారం ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం సెనేట్ హాల్ లో నిర్వహించారు. ఆచార్య కట్టమంచి రామలింగారెడ్డి పేరుతో జరిగిన ఈ ఉపన్యాస కార్యక్రమంలో "ఆధునిక సాహిత్య విమర్శ - దక్పథాలు" అనే అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు జి.అరుణకుమారి ప్రసంగించారు. ప్రాచీన కాలం నుండి విమర్శ వుందని, అది వ్యాఖ్యల రూపంలో వుండేదని, ఆధునిక కాలంలో కట్టమంచి రామలింగారెడ్డి విమర్శను విచారం పదంతో సూచించారని, సిపి బ్రౌన్ వంటి మహనీయుల వల్ల గ్రంథపరిష్కరణ మెళకువలు నేర్చుకుందని, రాళ్లపల్లి అనంతకష్ణ శర్మ వేమన పై చేసిన విమర్శ మనకు మార్గదర్శి అని అన్నారు. వర్సిటీ ఇన్ చార్జి వీసీ ఆచార్య జీఎం సుందరవల్లి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ తెలుగుశాఖతో తనకు నాలుగు దశాబ్దాల అనుబంధం వుందన్నారు. ఈ కార్యక్రమాన్నిఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ నిర్వహించారు. ఆచార్య శ్రీనివాసులురెడ్డి, సునీల్ కుమార్, బ్రహ్మానందరెడ్డి, ఆదిశేషయ్య, అశోక్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ప్రమాదంలో గాయపడ్డ యువతి మృతి

ప్రజాశక్తి- నగరి

పట్టణ పరిధి మూతబడ్డ శాంతీ థియేటర్ సమీపం గత నెల 5వ తేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్.పూజ (16) అనే యువతి నెలరోజుల పాటు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు తమిళనాడు సరిహద్దు కరింబేడుకు చెందిన పూజ షోళింఘర్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. గతనెల 5వ తేదిన దీపావళికి దుస్తుల కొనుగోలుకు నగరికి వచ్చి తిరిగి వెళుతున్న సమయంలో జరిగిన రోడ్డుప్రమాదంలో గాయాలపాలైంది. ఆమెను చెన్నై స్టాన్లీ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. నెలరోజుల పాటు చికిత్స అందించినా పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది.

'నా బిడ్డ జాడ తెలపండి'

ఓ తండ్రి వేడుకోలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గత ఒకటిన్నర నెలగా ఆచూకీ తెలియక తన బిడ్డ కోసం వెతుకుతూనే ఉన్నామని తండ్రి ఏలుమలై జిల్లా ఎస్పీ వై.రిషాంత్ రెడ్డిని వేడుకున్నారు. బుధవారం తన బిడ్డ ఆచూకీ తెలపాలని కోరుతూ మండలలోని పులిమడుగు గ్రామస్తుడు పి.ఏలుమలై స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో వాపోయాడు. బాధితుడు మాట్లాడుతూ అక్టోబర్ 23వ తేదీ నుంచి తమ కుమార్తె పి.జోష్న(16) కనిపించడం లేదని, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేదని తెలిపారు. రెండు రోజుల తరువాత శ్రీనివాసపురంకు చెందిన పార్తిబన్ (25) తమ కుమార్తెను కిడ్నాప్ చేసినట్లు ప్రాథమికంగా తెలుసుకున్నామని, కిడ్నాప్‌కు పార్తిబన్ సోదరుడు సభాకాంత్, బంధువులు విజయ్ కుమార్, జయవేలు సహకరించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంగా మండల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమార్తె కనిపించపోవడంతో తన భార్య అనారోగ్యం పాలైందని, తమ బిడ్డ ఇంకా ప్రాణాలతోనే ఉందా అనే అనుమానం కలుగుతోందని, పోలీసులు తమ బిడ్డ ఆచూకీని తెలపాలని వేడుకున్నారు.

ఎంపి, ఎంఎల్ఎలపై కేసు కొట్టివేత



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎంఎల్ఎలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై ఉన్న కేసును కొట్టేస్తూ అమరావతిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. టిడిపి హయాంలో తిరుపతి విమానాశ్రయ అధికారులపై దాడి చేశారంటూ అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏర్పేడు పోలీసు స్టేషన్‌లో 2015లో కేసు నమోదు చేశారు. ఎనిమిదేళ్ల పాటు ఈ కేసు విషయమై వీరు కోర్టుకు హాజరయ్యారు. కేసుకు సంబంధించి ఆరోపణలు రుజువు కాకపోవడంతో కేసును కొట్టేస్తూ తీర్పు వెలువడింది. ప్రజాప్రతినిధుల తరపున న్యాయవాదులు మధుకర్‌బాబు, సురేష్, కోటిరెడ్డి వాదనలు వినిపించారు.

6,478మందికి ఆశ్రయం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుపతి జిల్లాలో మిచౌంగ్ తుపాను సందర్భంగా 84 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 6,478 మందికి ఆశ్రయం కల్పించినట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సహాయ చర్యలు చేపట్టామన్నారు. బుధవారం ముఖ్యమంత్రి తుపాను ప్రభావిత ఎనిమిది జిల్లాలైన తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లతో, ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా ప్రత్యేక అధికారి శ్యామలరావు, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పి పరమేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ తిరుపతి జిల్లాలో తుపాను ప్రభావం 29 మండలాల్లో, 546 గ్రామాలపై పడిందని, 84 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 6478 మందికి ఆశ్రయం కల్పించి వారికి టిఫిన్, భోజనం ఏర్పాట్లు చేశామన్నారు. ఇళ్లకు వెళ్లే సమయంలో ఒకరికి వెయ్యి, కుటుంబానికి 2,500 రూపాయల చొప్పున అందించేందుకు సంబంధిత ఆర్డీవోలకు నిధులు విడుదల చేశామన్నారు. 22,635 మంది కుటుంబాలకు 25 కేజీల బియ్యం, లీటర్ వంటనూనె, కందిపప్పు, ఉల్లి, బంగాళాదుంపలు కేజీ వంతున అందిస్తున్నామన్నారు. గాలుల నేపథ్యంలో 496 గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, బుధవారం సాయంత్రానికి ఐదారు గ్రామాలు మినహా పూర్తిగా పునరుద్ధరిస్తామన్నారు. వాకాడు రహదారిలో రవాణా మార్గం ఇబ్బంది వల్ల ఆలస్యం అవుతోందని వివరించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా బోర్ల వద్ద జనరేటర్లు, ట్యాంకర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆర్ అండ్ బికి సంబంధించి 97 కిలోమీటర్లు, పంచాయతీరాజ్ సంబంధించి 87 కిలోమీటర్లు దెబ్బతిన్నాయని, ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపట్టామన్నారు. విత్తు వేసి నెలరోజులు మాత్రమే అయిన వరి పంట 7126 హెక్టార్లు, హార్టికల్చర్‌కు సంబందించి మిరప, పూల తోటలు సుమారు 246 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందన్నారు. పిచ్చాటూరు వద్ద ఆక్వా ఫామ్ దెబ్బతిన్నదని, పశువులు, దూడలు, గొర్రెలు, మేకలు చనిపోయాయని తెలిపారు.